ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 తమిళనాడు TAMILNADU
బుధవారం 28 మే 2025

వర్ష బీభత్సం
ఇళ్లు, చెట్లు ధ్వంసం


కోవై జిల్లా సత్యానగర్‌లో పెనుగాలులకు ధ్వంసమైన ఇంటి పైకప్పు


నిండుకుండలా ఉన్న అమరావతి డ్యామ్


ఊటీ పుదుమత్తు ప్రాంతంలో చెట్టుకూలి ధ్వంసమైన బైకు

- కోవై, నీలగిరి, తిరుప్పూరు, తెన్‌కాశి జిల్లాల్లో కుండపోత
- నేలకొరిగిన చెట్లు
- ప్రమాద స్థాయిలో జలాశయాలు

చెన్నై, మే 27 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కోయంబత్తూరు, నీలగిరి, తిరుప్పూరు, తెన్‌కాశి జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. ఈ నాలుగు జిల్లాల్లో పెనుగాలులతో కురిసిన భారీ వర్షాలకు చెట్లు కూలిపడ్డాయి. మట్టి పెళ్ళలు విరిగిపడి ఇళ్లు ధ్వంసమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ జిల్లాల్లోని ప్రధాన జలాశయాలు ప్రమాద స్థాయికి చేరుకుంటున్నాయి. బంగాళాఖాతంలో మంగళవారం ఉదయం అల్పవాయుపీడనం ఏర్పడింది. దీంతో రాష్ట్రానికి ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. ఈ నెలాఖరు వరకు తిరుప్పూరు, దిండుగల్, తేని, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లోనూ భారీగా వర్షాలు కురువనుండటంతో ఆ జిల్లాలకు కూడా ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు.

కోయంబత్తూరులో...

కోవై జిల్లాకు రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో గత మూడు రోజులుగా కోవై నగరం, సబర్బన్ ప్రాంతాల్లో కుండపోతగా వర్షాలు కురిశాయి. దీని కారణంగా జిల్లాలోని ప్రధాన జలాశయాలు పొంగి ప్రవహిస్తున్నాయి. వాల్పారైలో సోమవారం చెదురుమదురుగా కురిసిన వర్షానికి సోలయార్ ఎస్టేట్ మార్గంలో మునీశ్వరన్ గుడి ప్రాంతంలో ఓ చెట్టు కూలింది. దీంతో ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శక్తి ఎస్టేట్ ప్రాంతంలో విద్యుత్ స్తంభంపై చెట్టు కూలిపడటంతో రెండు రోజులుగా ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మంగళవారం ఉదయం వాల్పారై - పొల్లాచ్చి ఘాట్‌రోడ్డులోని ఆరో మలుపువద్ద ఓ చెట్టు కూలి పడటంతో ఆ మార్గంలోనూ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మంగళవారం వేకుజామున పెనుగాలులకు సోలయారు డ్యామ్ ప్రాంతం సత్యానగర్‌లో సుదర్శనన్ అనే వ్యక్తికి చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి వెళ్ళి ఇంటిలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు.


కేత్తి వద్ద చెట్టు కూలడంతో ధ్వంసమైన పోలీసుస్టేషన్

అమరావతి డ్యామ్‌లో పెరిగిన నీటిమట్టం...

తిరుప్పూరు జిల్లా ఉడుమలై అమరావతి డ్యామ్‌లో ఒకే రోజు ఆరడుగుల మేర నీటిమట్టం పెరిగింది. దీంతో పంచలింగ జలపాతంలో పర్యాటకుల స్నానంపై నిషేధం విధించారు. అమరావతి జలాశయ సామర్థ్యం 90 అడుగులు.. ఈ జలాశయం ద్వారా తిరుప్పూరు, కరూరు జిల్లాల్లో సుమారు 55 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు. ఆ డ్యామ్ పరీవాహక ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురియటంతో అమరావతి డ్యామ్‌లో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఆదివారం ఆ డ్యామ్‌లో 45 అడుగులున్న నీటిమట్టం సోమవారం హఠాత్తుగా ఆరడుగుల మేర పెరిగింది. ప్రస్తుతం ఆ డ్యామ్‌లో నీటిమట్టం 51.25 అడుగులకు చేరింది. ఉడుమలై తిరుమూర్తి మలై ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో పంచలింగ జలపాతంలో అడవి వెల్లువ ఉధ్రుతంగా ఉంది.. కన్నిమార్ గుడి, ముమ్మూర్తులున్న అమరలింగేశ్వరాలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. అమావాస్య సందర్భంగా సోమవారం ఉదయం ఆ ప్రాంతానికి వెళ్ళిన వేలాదిమంది భక్తులు ఆలయాలకు వెళ్ళలేక తిరుగుముఖం పట్టారు.

నీలగిరి జిల్లాలో...

గత మూడు రోజులుగా నీలగిరి జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. ముఖ్యంగా ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన ఊటీ, గూడలూరు, కేత్తి తదితర ప్రాంతాల్లో రహదారుల్లో చెట్లు కూలిపడ్డాయి. ఇళ్లు ధ్వంసమయ్యాయి. పెనుగాలులతో కురిసిన భారీ వర్షాలకు ఊటీ వద్ద నాలుగిళ్లు, గూడలూరు 300 అరటి చెట్లు ధ్వంసమయ్యాయి. ఇదే విధంగా భారీ వర్షాల కారణంగా ఊటీలో 11, కుందాలో 13, కున్నూరులో 5, కోత్తగిరిలో 2, గూడలూరులో 9, పందలూరు 3 మొత్తం 43 చెట్లు కూలిపడినట్లు జిల్లా అధికారులు ప్రకటించారు. కుందాలోని ఓ ప్రాంతంలో మట్టిపెళ్ళలు విరిగిపడ్డాయన్నారు. మంగళవారం కూడా ఊటీలోని పర్యాటక ప్రదేశాలను అధికారులు మూసివేశారు. దీంతో పర్యాటకులు తీవ్ర నిరాశకు గురయ్యారు.


పర్యాటకులు లేక బోసిపోయిన కుత్రాలం జలపాతం

తెన్‌కాశి జిల్లాలో...

నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెన్‌కాశి జిల్లాలోనూ గత మూడు రోజులుగా భారీగా వర్షాలు కురిశాయి. దీంతో కుత్రాలం జలపాతాల వద్ద వరద దృశ్యాలు నెలకొనటంతో ఆ ప్రాంతాల వద్ద పర్యాటకులు స్నానానికి వెళ్ళకుండా నిషేధం విధించారు. ప్రస్తుతం ప్రధాన జలపాతం, ఐందరువి, పాత కుత్రాలం, చిత్రరువి, పులియరువి తదితర జలపాతాల వద్ద కూడా నీటి ఉధ్రుతి ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లోనూ పర్యాటకుల స్నానాలపై నిషేధం విధించారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం...

భారత వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటించినట్లుగానే బంగాళాఖాతంలో ఎగువలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం మరింత బలపడి అల్పపీడనంగా మారింది. మంగళవారం ఉదయం వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ - మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు భారత వాతావరణశాఖ ప్రకటించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో నైరుతి రుతుపవనాలు మరింతగా బలపడతాయని కూడా పేర్కొంది.


వాల్పారై ఘాట్‌రోడ్డులో కూలిన చెట్టు కొమ్మలను తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది.

రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్...

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ నెల 30 వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలుండటంతో ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు.. ఈ కారణంగా కోయంబత్తూరు జిల్లాలోని పడమటి కనుమల ప్రాంతంలో, నీలగిరి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు నుండి భారీ స్థాయిలో వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు పేర్కొన్నారు. తిరుప్పూరు, దిండుగల్, తేని, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తాయని తెలిపారు.

మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా
జస్టిస్ శ్రీవాత్సవ

- సుప్రీం కొలీజియం సిఫారసు


జస్టిస్ ఎంఎం శ్రీవాత్సవ

ప్యారీస్, మే 27 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వున్న జస్టిస్ ఎంఎం శ్రీవాత్సవను మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ కొలీజియం సుప్రీంకోర్టుకు కొత్తగా ముగ్గురు న్యాయమూర్తులను ప్రతిపాదించింది. అలాగే మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్‌ను రాజస్థాన్‌కు, రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీవాత్సవను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం ప్రతిపాదించింది. దేశంలోని 25 హైకోర్టుల్లో ఉన్న 1,122 న్యాయమూర్తుల పదవుల్లో ప్రస్తుతం 354 పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటి భర్తీకి సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం చర్చలు జరిపింది. ఈ సమావేశంలో పలు రాష్ట్రాల హైకోర్టుల్లో పనిచేస్తున్న ప్రధాన న్యాయమూర్తులను బదిలీ చేసే అంశంపై కొలీజియం సభ్యులైన ఐదుగురు న్యాయమూర్తులు చర్చించి నిర్ణయం తీసుకున్నారు. కాగా సుప్రీం కొలీజియం సిఫారసులను పరిశీలించిన అనంతరం కేంద్రం రాష్ట్రపతి ఆమోదానికి పంపుతుంది. రాష్ట్రపతి ఆమోదించాక ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయి.



యూట్యూబ్ ఛానల్ ప్రారంభించిన
అజిత్ బృందం

5

మనోన్మణియం వర్సిటీ సెమిస్టర్ వాయిదా

- ప్రశ్నపత్రం లీకేజే కారణమా?

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్ష వాయిదా పడడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రశ్నపత్రం లీకవడం వలనే పరీక్ష వాయిదా పడిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తిరునల్వేలి జిల్లా అభిషేకపట్టిలోని మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయం పరిధిలో తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి, కన్నియాకుమారి తదితర నాలుగు జిల్లాల్లో 106 కళాశాలలున్నాయి. వర్శిటీ పరిధిలోని కళాశాలల్లో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు 99 కేంద్రాల్లో జరుగుతున్నాయి. టైం టేబుల్ ప్రకారం మంగళవారం 'ఇండస్ట్రియల్ లా' పాఠ్యాంశానికి సంబంధించిన సెమిస్టర్ పరీక్ష జరగాల్సివుంది. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులు ప్రవేశించిన తర్వాత వారికి ప్రశ్నపత్రం ఇచ్చిన కొద్ది నిమిషాల్లోనే వాటిని తీసుకున్న ఇన్విజిలేటర్లు.. పరీక్ష వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఈ విషయమై వర్సిటీ నిర్వాహకులు మాట్లాడుతూ... ఇండస్ట్రియల్ లా పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీకైనట్లు సమాచారం అందిందని, అందువల్ల పరీక్ష తాత్కాలికంగా వాయిదావేసినట్లు తెలిపారు. ఈ నెల 29వ తేది వరకు సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని, ప్రస్తుతం లీకైన ప్రశ్నాపత్రం బదులుగా వేరే ప్రశ్నపత్రం తయారుచేయనున్నామన్నారు. అందువల్ల వాయిదావేసిన పరీక్ష ఈ నెల 30 ,31 తేదీల్లో నిర్వహించే అవకాశముందని తెలిపారు.

దురహంకార ఫాసిస్ట్ పాలన

- అగ్నిబాధితుల్ని ఆదుకునేవారిపై పోలీసులు దాడి చేస్తారా?
- ఇదేం వైఖరి?.. సీఎం దీనిని సమర్థిస్తారా?
- డీఎంకే ప్రభుత్వంపై విజయ్ ధ్వజం



చెన్నై, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన లేదని, దురహంకారంతో కూడిన ఫాసిస్ట్ పాలన సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వంపై తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పోలీసు శాఖ అధికార పార్టీకి కీలుబొమ్మగా మారి, అమాయక ప్రజలపె బలప్రయోగం చేస్తూ, ప్రజల్లో ద్వేషాన్ని రెచ్చగొడుతోందని విజయ్ దుయ్యబట్టారు. స్థానిక వ్యాసర్పాడి ముల్లైనగర్ ప్రాంతంలో సోమవారం సంభవించిన అగ్నిప్రమాదంలో గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయన్నారు. సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలను సమీపంలోని పాఠశాలలో ఉంచారని, వారికి టీవీకే కార్యకర్తలు మానవతా దృక్పథంతో బట్టలు, దుప్పట్లు, చాపలు, అత్యవసర సామగ్రి అందించారన్నారు. కానీ, పోలీసులు జోక్యం చేసుకుని, టీవీకే కార్యకర్తలు అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారన్నారు. ఇదేమని ప్రశ్నించిన పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి గంగావతిపై పోలీసులు దాడిచేయడమేంటని ప్రశ్నించారు. బాధితులను ఆదుకొనేందుకు ముందుకు వచ్చిన వారిని పోలీసులు అడ్డుకోవడమేంటి? పోలీసుల చర్యలను సీఎం సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు పునరావృత్తమైతే టీవీకే తరఫున ప్రజలను సమీకరించి పోరాటాలు చేస్తామని విజయ్ హెచ్చరించారు.

కొళత్తూరు, పళని, పాళయంకోటల్లో
వృద్ధాశ్రమాలు

- శంకుస్థాపన చేసిన సీఎం స్టాలిన్

చెన్నై, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన సొంత నియోజకవర్గమైన కొళత్తూరులో మంగళవారం ఉదయం విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొళత్తూరు రాజాజీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో వృద్ధాశ్రమాలకు శంకుస్థాపన చేసిన ఆయన మరమ్మతులతో కొత్త రూపు సంతరించుకున్న జనరల్ కుమారమంగళం చెరువు, ఉద్యానవనం, తనికాచలం నగర్ కాలువ ప్రారంభించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సహాయాలు పంపిణీ చేశారు. మొదట రాజాజీనగర్‌లో రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కొళత్తూరు, పళని, పాళయంకోట ప్రాంతాల్లో రూ.22.61 కోట్లతో నిర్మించనున్న వృద్ధాశ్రమాలకు శంకుస్థాపన చేశారు. అరుళ్‌మిగు బాలియమ్మన్ ఆలయం, అరుళ్‌మిగు ఇలంకాళియమ్మన్ ఆలయ ఆధ్వర్యంలో రూ.8.88 కోట్లతో కొళత్తూరులో 75 మంది వృద్ధులు బసచేసే రీతిలో వృద్ధాశ్రమం నిర్మించనున్నట్లు స్టాలిన్ ప్రకటించారు. ఇదే విధంగా దిండుగల్ జిల్లా పళనిలో అరుళ్‌మిగు దండాయుధపాణి స్వామి ఆలయం ఆధ్వర్యంలో 8.48 కోట్లతో మరో వృద్ధాశ్రమాన్ని, తిరునల్వేలి జిల్లా అరుళ్‌మిగు నెల్లయప్పర్ ఆలయం ఆధ్వర్యంలో రూ.5.25 కోట్ల తో పాళయంకోట వద్ద వృద్ధాశ్రమాన్ని నిర్మించనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమం తర్వాత తిరువాన్మియూరు అరుళ్‌మిగు పాంబన్ కుమారగురుదాస స్వామిగళ్ ఆలయంలో ఓదువార్ (ఆలయాల్లో భక్తిగీతాలను పాడే) ఉద్యోగానికి ఎంపికైన పాక్షిక దివ్యాంగురాలు ఎస్ఎస్ ప్రియవదనకు నియమాక ఉత్తర్వును స్టాలిన్ అందజేశారు. అదేవిధంగా జీకేఎం కాలనీ మెయిన్‌రోడ్డులో హరిశ్చంద్రా మైదానంలో అనితా అచీవర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో స్టాలిన్ పాల్గొని ఆ అకాడమీలో శిక్షణ పూర్తిచేసుకున్న 350మంది విద్యార్థులకు కుట్టుమిషన్లు, 131 మంది విద్యార్థులకు లాప్‌టాప్‌లు, వంద మందికి కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత జీకే ఎం కాలనీ వీధిలో సీఎండీఏ నిధులతో మరమ్మతు చేసిన జనరల్ కుమారమంగళం చెరువు ప్రారంభించారు. కొళత్తూరు ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన టెన్త్, ప్లస్-2 పరీక్షల్లో ఉత్తీర్ణులైన 318 మంది బాలబాలికలను సత్కరించి విద్యా ఉపకరణాలను అందజేశారు. పెరియార్‌నగర్ 4వ వీధిలో జరిగిన కార్యక్రమంలో 150 మంది దివ్యాంగులకు రూ.1.47 కోట్లతో కొనుగోలు చేసిన మూడు చక్రాల స్కూటర్లను అందజేశారు. చివరగా కుమరన్ నగర్ 80 అడుగుల రహదారిలో జరిగిన కార్యక్రమంలో రూ. 91.36 కోట్లతో మరమ్మతు చేసిన తనికాచలం నగర్ కాలువను కూడా స్టాలిన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్. ప్రియా, ఎంపీలు డాక్టర్ కళానిధి వీరాసామి, గిరిరాజన్, శాసనసభ్యులు తాయగం కవి, ఎ.వెట్రియళగన్, జోసెఫ్ సామువేల్, ఎస్.సుదర్శనం, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధ్యక్షుడు పి.రంగనాథన్, పర్యాటక సంస్కృతీ, దేవాదాయ శాఖల అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.మణివాసన్, జలవనరుల శాఖ కార్యదర్శి జె.జయకాంత్, కార్పొరేషన్ కమిషనర్ జె.కుమారగురుబరన్, దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, చెన్నై జిల్లా కలెక్టర్ రష్మీ సిదార్థ్, పెరియార్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.హేమలల, అనితా అచీవర్స్ అకాడమీ సీఈఓలు నరేంద్రన్, హెలెన్ తదితరులు పాల్గొన్నారు.


వృద్ధాశ్రమాలకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి, చిత్రంలో మేయర్ ప్రియ, మంత్రులు తదితరులు

రాజ్యసభ ఎన్నికల్లో
ఓపీఎస్‌కు ఇరకాటం!

- ఈపీఎస్ అభ్యర్థికి మద్దతు తప్పనిసరి
- విప్‌ను ధిక్కరించలేని పరిస్థితి

చెన్నై, మే 27 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న రాజ్యసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్)కు పెద్ద చిక్కొచ్చిపడింది. పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఎంపిక చేసిన అభ్యర్థికి ఓపీఎస్, ఆయన అనుచరవర్గం ఖచ్చితంగా మద్దతివ్వాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఓపీఎస్ వర్గీయులంతా అయోమయంలో ఉన్నారు. శాసనసభలో ఓపీఎస్, ఆయన వర్గానికి చెందిన శాసనసభ్యులు ప్రత్యేక వర్గంగా చెలామణి అవుతున్నారు. ఈపీఎస్‌తో ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఓపీఎస్ పార్టీ పదవి కోల్పోయారు. అప్పటి నుండి ఈపీఎస్ కోరల్లో చిక్కుకున్న పార్టీకి విముక్తి కలిగిస్తానంటూ అదేపనిగా ప్రకటనలు చేస్తూ 'ఉరిమై మీట్పు కుళు' (హక్కుల విముక్తి బృందం) పేరుతో ప్రత్యేకవర్గంగా ఉంటున్నారు. శాసనసభలో ఓపీఎస్, ఆయన మద్దతుదారులుగా ఉన్న శాసనసభ్యులు మనోజ్ పాండ్యన్, వైద్యలింగం, అయ్యప్పన్ ఇంకా అన్నాడీఎంకే సభ్యులుగానే కొనసాగుతున్నారు. ఈ పరిస్థితుల్లో జూన్ 19న జరుగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ అధ్యక్షుడు ఈపీఎస్ ఎంపిక చేసే అభ్యర్థులకు ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా మద్దతివ్వాల్సి ఉంటుంది. ఆ మేరకు అన్నాడీఎంకే విప్ జారీ చేస్తే దానికి ఓపీఎస్, ఆయన అనుచరులైన ముగ్గురు శాసనసభ్యులు కట్టుబడాల్సి ఉంటుంది. విప్ ఉల్లంఘించి, ఈపీఎస్ ప్రతిపాదించిన అభ్యర్థులకు మద్దతివ్వకుంటే శాసనసభ్యత్వాన్ని కోల్పోవలసి ఉంటుంది. ఓపీఎస్ వర్గానికి చెందినవారు ప్రస్తుతం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేలోనే కొనసాగుతున్నారు. కనుక బీజేపీతో పొత్తు ఖరారు చేసుకున్న అన్నాడీఎంకేకు వ్యతిరేకంగా ప్రవర్తించలేని పరిస్థితిలో ఓపీఎస్ ఉన్నారు. వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయేలో అధిక సీట్లు పొందటానికి రాజ్యసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థులకే ఓపీఎస్ సహా నలుగురు ఎమ్మెల్యేలు మద్దతి వ్వాల్సిఉంది. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో శాసనసభలో ప్రవేశపెట్టిన కొన్ని బిల్లులకు విప్ ఆదేశం ప్రకారం ఓపీఎస్ సహా నలుగురు శాసనసభ్యులు మద్దతు ప్రకటించారు. వచ్చే యేడాది వరకు ఓపీఎస్ సహా నలుగురూ శాసనసభ్యులుగానే కొనసాగాలంటే రాజ్యసభ ఎన్నికల్లో ఈపీఎస్ ప్రతిపాదించే అభ్యర్థులు తప్పనిసరిగా మద్దతివ్వడం మినహా మరో మార్గం లేదు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుంటే రాజ్యసభ ఎన్నికల్లో ఈపీఎస్ ప్రతిపాదించే అభ్యర్థులకే ఓపీఎస్ వర్గీయులు మద్దతు ప్రకటించడం ఖాయమని తెలుస్తోంది.

5 తర్వాతే కమల్ నామినేషన్...

రాజ్యసభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో ఉన్న మక్కల్ నీదిమయ్యం అధ్యక్షుడు, నటుడు కమల్‌హాసన్ జూన్ ఐదు తర్వాత నామినేషన్ వేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదుర్చుకున్న పొత్తు ప్రకారం మక్కల్ నీదిమయ్యానికి ఒక రాజ్యసభ సీటు కేటాయించనున్నారు. ఆ సీటుకు పార్టీ అధ్యక్షుడు కమల్‌హాసనే పోటీచేయనున్నారు. ప్రస్తుతం కమల్‌హాసన్ 'థగ్‌లైఫ్' సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో బిజీగా ఉంటున్నారు. ఆ చిత్రం జూన్ 5న విడుదలవుతుంది. ఆ తర్వాతే ఆయన నామినేషన్ దాఖలు చేస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తాంబరం: రాజాకీల్పాక్కం క్యాంప్ రోడ్డు, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, భారతి పార్క్ వీధి, కరణం వీధి, రాజా అయ్యర్ వీధి, మాతా ఆలయ వీధి, నెల్లూరమ్మన్ ఆలయ వీధి, పాలైయాధాన్ వీధి, న్యూ బాలాజీ నగర్, ఎక్స్‌టెన్షన్, లోరా వీధి, అవ్వై నగర్, కన్నన్ నగర్ మరియు ఐటీబీ కాలని, చిట్లపాక్కం జీఎస్‌టీ రోడ్డు, సిద్ధ హాస్పిటల్, శానిటోరియం, సుందరం కాలనీ 1 నుంచి 3 మెయిన్ రోడ్లు, ఎస్వీ ఆలయ వీధి, వీవీ ఆలయ వీధి, రైల్వే బోర్డర్ రోడ్డు, అమర జీవా వీధి, జయ నగర్ మెయిన్ రోడ్డు, 1,2,3 క్రాస్ వీధులు, వేదాంతం కాలనీ, ఎవ లప్పన్ వీధి, కుప్పుస్వామి వీధి, మాధవన్ వీధి, సుందరాంబాళ్ నగర్, షర్మిల వీధి, వాటర్ బోర్డు, కుమరన్ వీధి, జీవా వీధి, కామరాజర్ నగర్, అప్పారావు కాలని

అంబత్తూర్: జేజే నగర్ చర్చి రోడ్డు, ట్రినిటీ చర్చి రోడ్డు, ఓవీ జోసఫ్ వీధి, వసంత వీధి, లిస్సా పొన్నమ్మాళ్ వీధి, శ్రీనివాసన్ వీధి, భాగ్యం వీధి, పిళ్లయార్ ఆలయ వీధి, సెల్వి జయకుమార్ వీధి, ఆరణి సుబ్రమణియన్ వీధి, జార్జి రత్నం వీధి, సిసిలి పుష్పం వీధి, రత్నవేల్‌పాండ్యన్ వీధి, జీజీ నగర్

తిరువేర్కాడు: మహాలక్ష్మి కాలేజ్ సుందర చోళాపురం, రామ్ నగర్, సుందర వినాయక నగర్, చెల్లియమ్మన్ నగర్, గ్రీన్ పార్క్, చొక్కరేశ్వరి నగర్

నేడు జీసీసీ సమావేశం

పెరంబూర్, మే 27(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) సమావేశం బుధవారం జరుగనుంది. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో... జీసీసీ సమావేశం ఈ నెల 29వ తేది గురువారం జరుగుతుందని ఇదివరకే ప్రకటించామని, కానీ నిర్వహణ కారణాల రీత్యా ఒక రోజు ముందుగా ఈ నెల 28వ తేది ఉదయం 10 గంటలకు మేయర్ ప్రియ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని జీసీసీ తెలిపింది.

మంచిర్యాలలో సూపర్‌ఫాస్ట్ రైలుకు హాల్ట్

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-భగత్ కి కోఠి- సెంట్రల్ సూపర్ ఫాస్ట్ రైళ్లకు తెలంగాణా రాష్ట్రం మంచిర్యాల స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో నెం.06157 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భగత్ కి కోఠి వారాంతపు సూపర్ ఫాస్ట్ రైలు ఈ నెల 28వ తేది నుంచి ఉదయం 6.14 గంటలకు మంచిర్యాల స్టేషన్‌కు చేరుకుని 6.15 గంటలకు బయల్దేరుతుంది. అలాగే, నెం.06158 భగత్ కి కోఠి-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ సూపర్ ఫాస్ట్ ప్రత్యేక రైలు ఈ నెల 31వ తేది నుంచి ఉదయం 10.34 గంటలకు మంచిర్యాల స్టేషన్ చేరుకుని 10.35 గంటలకు బయల్దేరి వెళ్తుందని దక్షిణ రైల్వే తెలియజేసింది.

30న టీవీకే ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన సభ

అడయార్, మే 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో 10, 12 తరగతి పబ్లిక్ పరీక్షల్లో నియోజకవర్గాల వారీగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు సినీ హీరో, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ఈ నెల 30వ తేదీన అభినందన సభ జరుగనుంది. తొలి అభినందన సభ ఈనెల 30వ తేదీ సాయంత్రం 4గంటలకు మహాబలిపురంలోని షెరటాన్ హోటల్‌లో జరుగుతుందని టీవీకే ప్రధాన కార్యాలయం సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది.

12న సీఎం చేతుల మీదుగా మేట్టూరు జలాల విడుదల

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 11వ తేది సేలం వెళ్లనున్నారు. 12వ తేది ఉదయం మేట్టూరు డ్యాం నుంచి సాగునీటిని సీఎం విడుదల చేయనున్నారు. అనంతరం ఇరుంపాలై రోడ్డు సమీపంలోని ప్రభుత్వ మోహనకుమారమంగళం వైద్యకళాశాల ప్రాంగణంలో జరుగున్న కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం, వివిధ శాఖల ఆధ్వర్యంలో సుమారు లక్ష మందికి రూ.1,200 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలు అందించనున్నారు. అలాగే, జిల్లాలో పూర్తిచేసిన పథకాల ప్రారంభం, కొత్త పథకాలకు శంకుస్థాపన తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారని పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్ తెలిపారు.

ప్రసవ తేదీకి ముందే ఆస్పత్రిలో చేర్చండి

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న గర్భిణులను ప్రసవ తేదీకి ముందుగానే ఆస్పత్రులకు అనుమతించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆరోగ్య శాఖ విడుదల చేసిన ప్రకటనలో... నైరుతి రుతుపవనాల ప్రభావంతో పలు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తుండగా, ఈ నెల 30వ తేది వరకు వర్షాలుంటాయని వాతావరణ కేంద్రం తెలియజేసిందన్నారు. ఈ క్రమంలో, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే రోగులకు ఇబ్బందులు కలుగకుండా జనరేటర్లు ఏర్పాటుచేసుకోవాలని తెలిపింది. వరద బాధిత ప్రాంతాల్లో క్లోరినేషన్ చేపట్టాలని ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

లబ్ధిదారులకు
ఇళ్ల పట్టాల పంపిణీ



ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, మే 27 (ఆంధ్రజ్యోతి): పల్లిపట్టు మండలంలో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందించే కార్యక్రమం మంగళవారం జరిగింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు అందించాలని ఇటీవల ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. ఆ ప్రకారం, పల్లిపట్టు మండలంలోని కొళత్తూర్, కుమారాజుపేట, బొమ్మరాజుపేట, అత్తిమాంజేరిపేట, పొదటూరుపేట, నెడిగళ్లు, కీచ్చళం, నొచ్చిలి తదితర గ్రామాలకు చెందిన 215 మందికి ఎమ్మెల్యే చంద్రన్ ఇళ్ల పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు అన్బళగన్, రవికుమార్, డీఎంకే మండల కార్యదర్శులు శ్రీనివాసన్, చంద్రన్, మండల మాజీ కార్యదర్శి పి.రవీంద్రనాధ్ రెడ్డి, డీఎంకే పట్టణ కార్యదర్శి సెంథిల్‌కుమార్, నాయకులు గోపి, దేవరాజ్, బాబురెడ్డి, లోకనాధం, నాగరాజ్, మీసై వెంకటేశన్, నేతాజీ, సంజీవిరాజు పాల్గొన్నారు.

● విచారణ ఖైదీ మృతి వ్యవహారం...
పోలీసులకు రూ.10లక్షల జరిమానా

వాషర్‌మెన్‌పేట, మే 27 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లో చిత్రహింసలకు గురై మరణించిన గోకుల కన్నన్ కేసులో ఏడుగురు పోలీసులకు రూ.10 లక్షల జరిమానా విధిస్తూ మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది. సేలం జిల్లా కరుమలైకూడల్ గ్రామంలో 2015లో జరిగిన పళనిస్వామి హత్యకేసులో, అదే గ్రామానికి చెందిన గోకుల్ కన్నన్‌ను కరుమలైకూడల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ సందర్భంగా ఎస్‌ఐలు హరిహరన్, కీర్తివాసన్, వేణుగోపాల్, నలుగురు పోలీసులు అతడిని చిత్రహింసలకు గురిచేయడంతో, గుండెపోటుకు గురైన గోకుల్ కన్నన్ స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ప్రచురితమైన వార్తల ఆధారంగా మానవ హక్కుక కమిషన్ సుమోటోగా కేసు నమోదుచేసి విచారించింది. కేసు విచారణ పూర్తి కావడంతో కమిషన్ సభ్యులు కనకదాసన్ జారీ చేసిన ఉత్తర్వుల్లో... కేసుకు సంబంధించిన పత్రాలు నివేదిక పరిశీలించగా, పోలీస్‌స్టేషన్‌లో దాడికి గురై గోకుల్ కన్నన్ మృతిచెందినట్లు తెలిసిందన్నారు. అందువల్ల గోకుల కన్నన్ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారాన్ని నెల రోజుల్లో ప్రభుత్వం అందజేయాని ఆదేశించారు. ఆ పరిహారాన్ని ఎస్‌ఐలు హరిహరన్, కీర్తివాసన్, వేణుగోపాల్ తదితరుల నుంచి తలా రూ.2 లక్షలు, నలుగురు పోలీసుల నుంచి తలా రూ. లక్ష వసూలుచేయాలని, ఏడుగురిపై శాఖాపరమైన చర్యలు చేపట్టి మూడు నెలల్లో నివేదిక దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

లంచం కేసులో బిల్ కలెక్టర్‌కు నాలుగేళ్ల జైలుశిక్ష

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను రశీదు ఇచ్చేందుకు రూ.2 వేలు లంచం తీసుకున్న బిల్ కలెక్టర్‌కు నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. శివగంగ జిల్లా తొట్టాంబట్టి గ్రామానికి చెందిన కృష్ణకుమార్ 2009లో సింగంపునరిలో కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. కొత్త ఇంటికి రశీదు కోసం సింగంపునరి మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకున్నాడు. బిల్ కలెక్టర్ ధనపాల్, రసీదు కోసం రూ.2 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో కృష్ణకుమార్ శివగంగ జిల్లా అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనలతో అదే ఏడాది జూలై 8వ తేది రసాయనాలు పూసిన కరెన్సీని బాలకృష్ణన్ బిల్ కలెక్టర్‌కు అందిస్తుండగా, అక్కడే మాటువేసిన అధికారులు అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసు విచారణ సోమవారం ముగిసిన నేపథ్యంలో, కృష్ణకుమార్‌కు నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తూ శివగంగ అవినీతి నిరోధక ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సెంథిల్‌మురళి తీర్పు వెలువరించారు.

అత్త దూషించిందంటూ మహిళ ఆత్మహత్య



అనుప్రియ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): అత్త దూషించడంతో కోడలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రెడ్‌హిల్స్ సమీపంలో చోటుచేసుకుంది. రెడ్‌హిల్స్ సమీపం మొండియమ్మన్ నగర్ ఔన్సాంగ్ వీధికి చెందిన అశ్విన్ రాజ్-అనుప్రియ (27) పెద్దల అనుమతితో రెండేన్నరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఏడాది వయస్సున్న కుమార్తె ఉంది. సోమవారం ఉదయం ఫ్రిజ్ నుంచి ఐస్‌క్రీమ్ కింద పడడంతో, అత్త చిత్ర కోడలిని మందలించినట్లు సమాచారం. దీంత, మనస్తాపం చెందిన అనుప్రియ, ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న రెడ్‌హిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి ఘటనపై కేసు నమోదుచేశారు.

అమెరికా దౌత్య కార్యాలయానికి బాంబు బెదిరింపు

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలై సమీపంలోని అమెరికా దౌత్య కార్యాలయానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఈ-మెయిల్ ద్వారా వచ్చిన బెదిరింపు కార్యాలయ అధికారులు తేనాంపేట పోలీసులకు తెలియజేశారు. బాంబ్ స్క్వాడ్ నిపుణులు, పోలీసు జాగిలంతో అక్కడకు చేరకున్న పోలీసులు, కార్యాలయం, ప్రాంగణాలను క్షుణ్ణంగా తనిఖీ చేయగా ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాకపోవడంతో, బెదిరింపు ఫేక్‌గా నిర్ధారించారు. అలాగే, ఈ-మెయిల్ పంపిన చిరునామా కోసం సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు.

బైక్ రేస్‌కు పాల్పడిన 10 మంది అరెస్ట్

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో బైక్ రేస్‌కు పాల్పడిన 10 మంది యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు రోజుల క్రితం కోయంబేడు-అడయార్ మధ్య అర్ధరాత్రి ఒంటి గంటకు బైక్ రేస్‌కు పాల్పడ్డారని పోలీసులకు సమాచారం అందింది. ఆన్‌లైన్‌లో నమోదుచేసుకుని 120-130 కి.మీ వేగంతో బైక్ వెళ్లినట్లు తెలసింది. ఈ విషయమై విచారణ చేపట్టిన అన్నానగర్ పోలీసులు, కోయంబడు నుంచి అడయార్ వరకు ఉన్న సీసీ ఫుటేజీ పరిశీలించి, రేస్‌కు పాల్పడిన కళాశాల విద్యార్థులు సహా 10 మందిని అరెస్ట్ చేసి, 9 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, రేస్‌లో పాల్గొన్న మరికొందరి కోసం గాలిస్తున్నారు.

విమానాశ్రయంలో డాలర్లు, ఈ-సిగిరెట్లు స్వాధీనం

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయంలో రూ.70 లక్షల విలువైన ఈ-సిగిరెట్లు, అమెరికన్ డాలర్లు స్వాధీనం చేసుకున్నారు. మలేసియా నుంచి నగరానికి వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేస్తుండగా, ఓ మహిళ నుంచి ఈ-సిగిరెట్లు, డాలర్లు స్వాధీనం చేసుకున్నారు. మహిళ ఇచ్చిన సమాచారంతో, వాటిని తీసుకెళ్లేందుకు విమానాశ్రయానికి వచ్చిన యువకుడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని డెలివరీ బాయ్ మృతి

వాషర్‌మెన్‌పేట, మే 27 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఫుడ్ డెలివరీ చేసే యువకుడు మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. పూందమల్లి కందస్వామి నగర్ ప్రాంతానికి చెందిన సెల్వం కుమారుడు రాజశేఖర్ (22) ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్లు తీసుకుని డెలివరీ చేస్తుంటాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా, పూందమల్లి-బెంగళూరు జాతీయ రహదారి కూత్తంబాక్కం సిగ్నల్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన రాజశేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఆవడి ట్రాఫిక్ పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ కోసం విచారిస్తున్నారు.

ధాన్యం కొనుగోలులో రూ.800 కోట్ల అవినీతి !

● సీబీఐ విచారణ కోరిన పీఎంకే

ప్యారీస్, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మార్కెటింగ్ కమిటీల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్ల వ్యవహారంలో జరిగిన రూ.800 కోట్ల అవినీతిపై సీబీఐ విచారణ జరపాలని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని తిరువళ్లూరు, కాంచీపురం సహా ఎనిమిది జిల్లాల్లో రైతుల నుండి జాతీయ వినియోగదారుల సహకార కమిషన్ అధికారులు రూ.811 కోట్ల మేర ధాన్యాన్ని కొనుగోలు చేసి, గత రెండు నెలలుగా గిట్టుబాటు ధర నిర్ణయించకుండా కాలయాపన చేసినట్లు అన్బుమణి ఆరోపించారు. ధాన్యం సరఫరా చేసిన రైతులకు న్యాయం చేకూరేలా వారితో కలిసి ఆందోళనలు చేపట్టనున్నట్లు అన్బుమణి హెచ్చరించారు.

ఈసీఆర్ మీదుగా ఎంటీసీ బస్సులు

● అన్నానగర్ డిపో నుంచి ఏర్పాట్లు

ప్యారీస్, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువాన్మియూర్ నుంచి ప్రారంభమై పుదుచ్చేరి వరకు ఉన్న ఈస్ట్ కోస్ట్ రోడ్డు మీదుగా నడుపుతున్న ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఇక నుండి కోయంబేడుకు బదులు అన్నానగర్ డిపో నుంచి బయలుదేరేలా ఏర్పాట్లు జరుగుతున్నట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. 2002వ సంవత్సరం రూ.102 కోట్లతో కోయంబేడులో బస్ టెర్మినల్ నిర్మించారు. ఈ బస్ టెర్మినల్ ప్రాంగణంలోవున్న ఎంటీసీ బస్‌స్టేషన్‌నుండి పలు రాష్ట్రాలకు, రాష్ట్రంలోని పలు జిల్లాలకు నడిపే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో సగానికి పైగా బస్సులను కిలాంబాక్కం, పూందమల్లి ఆవడి తదితర ప్రాంతాలకు మార్చారు. అందువల్ల కోయంబేడులో వాహనాల రద్దీ తగ్గింది. ప్రస్తుతం కోయంబేడు నుండి సుమారు 592 బస్సులు నడుపుతున్న నేపథ్యంలో, 400 బస్సులను కొత్తగా నిర్మించిన కూత్తంబాక్కం బస్‌స్టేషన్‌కు మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాగా కోయంబేడు నుండి ఈస్ట్ కోస్ట్ రోడ్డు మీదుగా పుదుచ్చేరి, కడలూరు, నాగపట్నం తదితర ప్రాంతాలకు నడుపుతున్న బస్సులను ఇకపై అన్నానగర్ బస్ డిపోల మీదుగా నడిపేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.


మెదడు నిర్జీవమైన మహిళ అవయవదానం



కంచర్ల పద్మ (ఫైల్‌ఫొటో)

వేలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుకు చెందిన కంచర్ల పద్మ (58)అనే మహిళ ఇటీవల చిత్తూరులో రోడ్డుప్రమాదానికి గురికావడంతో వేలూరులోని ప్రభుత్వాసుపత్రిలో ఆమె కుటుంబ సభ్యులు చేర్పించారు. చికిత్స ఫలించకపోవడంతో సోమవారం ఉదయం ఆమె మెదడు నిర్జీవమైంది. దీంతో ఆమె భర్త దస్తగిరి, మనవరాలు కృష్ణప్రియ ఆమె అవయవాలను దానం చేయాలని నిశ్చయించుకుని, చెన్నై ఎంజీఎంకు ఆస్పత్రికి అనుమతించారు. దీంతో ఆమె కళ్లు, కిడ్నీ, కాలేయం, ఊపిరితిత్తులు తదితర భాగాలను సేకరించి, ఆస్పత్రి సిబ్బంది పద్మ మృతదేహానికి అంజలి ఘటించారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



శిక్షణ ఇచ్చిన వారికి జ్ఞాపికలు అందిస్తున్న నిర్వాహకులు

తిరుత్తణి, మే 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణిలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం సోమవారంతో ముగిసింది. ఓం సర్వేష్ యోగా, స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి నిర్వహించిన శిబిరంలో యోగా కేంద్రం కార్యదర్శి బాబు యోగా, అథ్లెటిక్స్, మార్షల్ ఆర్ట్స్‌పై మాస్టర్ ఆర్.కార్తీక్ శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా చివరి రోజైన సోమవారం ప్రకృతి చికిత్స వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి డా.జి.రాజేష్, అరక్కోణం ప్రకృతి వైద్యులు డా.కె.కనకరాజ్, కోయంబత్తూర్ ప్రకృతి వైద్యులు ఎస్.అశోక్ హాజరై ప్రకృతి వైద్యం, పోషకాహారం, మధుమేహం, రక్తపోటు తదితరాలపై అవగాహన కల్పించారు.

ఆ కౌన్సిలర్‌కు తుపాకీ ఎక్కడిది? : ఈపీఎస్

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): అరక్కోణం డీఎంకే కౌన్సిలర్‌కు తుపాకి ఎలా వచ్చిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన ఎక్స్ పేజీలో... అనుమతి లేకుండా రెండు తుపాకులుంచారంటూ అరక్కోణం కౌన్సిలర్ బాబు సహా ఇద్దరిని అరెస్ట్ చేశారనే వార్తలు వెలువడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో, అరక్కోణం లైంగిక వేధింపులకు గురైన మహిళ, తనను పోలీసులు బెదిరిస్తున్నారంటూ విలపిస్తూ వీడియో విడుదల చేసిందని తెలిపారు. కౌన్సిలర్ దగ్గర అనుమతి లేకుండా తుపాకి ఉందన్నారు. అసలు కౌన్సిలర్‌కు తుపాకి ఎలా వచ్చిందో సీఎం స్పష్టం చేయాలన్నారు.

ఈపీఎస్‌కు 'జడ్ ప్లస్' భద్రత కల్పించండి

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామికి 'జడ్ ప్లస్' భద్రత కల్పించాలని ప్రతిపక్ష ఉప నేత ఉదయకుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. మదురైలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... సేలంలోని ఈపీఎస్ ఇంటికి బాంబు బెదిరింపు ఇది మొదటి సారి కాదని, లేఖ ద్వారా బాంబు బెదిరింపులు వస్తున్నాయన్నారు. ఈ విషయమై పోలీసులకు తెలిపినా సమగ్ర విచారణ చేపట్టడం లేదనే అనుమానం ఉందని, డీఎంకే ప్రభుత్వం కూడా ఈ విషయమై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇప్పటికే ఈపీఎస్‌కు 'వై ప్లస్' భద్రత ఉందని, బాంబు బెదిరింపుల నేపథ్యంలో, ఆయనకు 'జడ్ ప్లస్' భద్రత కల్పించాలని ఉదయకుమార్ డిమాండ్ చేశారు.

నీట మునిగి ఇద్దరు యువకుల మృతి

ప్యారీస్, మే 27 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా బోడి సమీపంలోని జలపాతంలో స్నానాలకు వెళ్లిన ఇద్దరు యువకులు నీటి మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బోడి సమీపంలోని జక్కమనాయకన్‌పట్టికి చెందిన పాండి (25), ఆకాశ్‌కుమార్ (24) ఆ గ్రామానికి దగ్గరలోవున్న పిచ్చాంగరై జలపాతంలో మంగళవారం ఉదయం దిగి స్నానాలు చేశారు. వారు లోతైన ప్రాంతానికి వెళ్లి నీట మునిగి ఊపిరాడక మరణించినట్లు కురంగణి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

తిరునల్వేలిలో గంజాయితో ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, మే 27 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు కిలో గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. తిరునల్వేలి బస్టాండు సమీపంలో మంగళవారం ఉదయం అనుమానాస్పదంగా సందరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అప్పుడు వారి బ్యాగు నుండి కిలో 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, దీనిపై కేసు నమోదు చేసి ఇసైక్కి (19) కన్నన్ (20)లను అరెస్టు చేసి, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

మృతదేహం మెడలోని తాళి చోరీ

● కోవై ఆస్పత్రి కాంట్రాక్ట్ ఉద్యోగి అరెస్టు

చెన్నై, మే 27 (ఆంధ్రజ్యోతి): కోయంత్తూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన మహిళ మెడలోని మాంగళసూత్రాన్ని చోరీ చేసిన కాంట్రాక్టు ఉద్యోగిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 20న పాపనాయకన్ పాళయం సాయుధదళం పోలీసు క్వార్టర్స్‌లో నివసిస్తున్న సెంథిల్‌కుమార్ అత్త తీవ్ర అస్వస్థతకు గురికావటంతో ఆస్పత్రిలో చికిత్సనిమిత్తం చేశారు. మరుసటి రోజు ఆమె చికిత్స ఫలించక మృతి చెందింది. ఆ తర్వాత ఆమె మృతదేహాన్ని కుటుంబీకులు ఇంటికి తీసుకెళుతున్నప్పుడు మెడలో మంగళసూత్రం లేకపోవడం గమనించారు. వెంటనే ఆ మహిళ కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆస్పత్రిలని సీసీ ఫుటేజీ పరిశీలించగా ఆ ఆస్పత్రిలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న కుమారపాళ్యం అముల్‌నగర్‌కు చెందిన రాజశేఖర్ మంగళసూత్రాన్ని అపహరించినట్లు గుర్తించి, మంగళవారం అతడిని అరెస్టు చేశారు.

హైవేపై మరమ్మతుల పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి కరసమంగళంలోని మంగళూరు-విల్లుపురం జాతీయ రహదారిపై అదనపు భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నారు. కొన్ని నెలలుగా కాట్పాడి సమీపంలోని కరసమంగళం హైరోడ్డు ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణంగా రోడ్డు మరమ్మతులకు గురైన ప్రాంతాల్లో చేపట్టిన పనులను మంగళవారం కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రోడ్ల మధ్యలో గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందికర పరిస్థితి ఉన్నదని, ఈ హైవేపై లైట్లు, రోడ్డు మరమ్మతులు, డివైడర్ల ఏర్పాటు తదితర పనులను చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడియాత్తం వీఆర్వో శుభలక్ష్మి, ఇంజనీర్లు రాజ్‌కుమార్, ధనశేఖరన్, సుందరరాజన్, జగదీశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

చెరకు మద్దతు ధర పెంచాల్సిందే

● ఎగ్మూరులో రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): చెరకుకు మద్దతు ధర కల్పించాలంటూ ఎగ్మూరులో మంగళవారం చెరకు రైతుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కేంద్రప్రభుత్వం చెరకు టన్నుకు రూ.5,000 ధర ప్రకటించాలని, చెరకు కర్మాగారాలు ఉత్పత్తి చేస్తున్న ఇథనాల్, విద్యుత్ తదితర ఉప ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం రైతులకు వాటా ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ చేపట్టాలని, రాష్ట్రంలోని చక్కెర కర్మాగారాలను ఆధునికీకరించాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు. చెరకు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్రన్, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వేల్‌మారన్, రాష్ట్ర కోశాధికారి పెరుమాళ్, 100 మందికి పైగా రైతులు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

మెట్రో రైల్వేస్టేషన్ ప్రాంగణంలో కూలిన చెట్టు



చెట్లను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ప్యారీస్, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైదాపేట మెట్రో రైల్వేస్టేషన్ ప్రాంగణంలో చెట్టు మంగళవారం సాయంత్రం కూకటివేళ్లతో నేలకూలింది. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలు, ఓ కారు, దుకాణం పైకప్పు ధ్వంసమయ్యాయి. సమాచారం తెలిసి ఘటనా స్థలానికి చేరుకున్న సైదాపేట ట్రాఫిక్ పోలీసులు కూలిన చెట్టు కొమ్మలను తొలగించారు. ఈ ప్రమాదంలో అదృష్టవశాస్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

ప్రయాణికుడికి తీవ్ర అస్వస్థత

● లక్నో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

చెన్నై, మే 27 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుండి లక్నోకు బయలుదేరిన విమానంలో ఓ ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురికావటంతో ఆ విమానాన్ని అర్థాంతరంగా ల్యాండింగ్ చేశారు. మీనంబాక్కం జాతీయ విమానాశ్రయం నుండి మంగళవారం వేకువజాము 5.40 గంటలకు 160 మంది ప్రయాణికులతో లక్నోకు ఓ విమానం బయలుదేరింది. విమానంలో ఆకాశంలో ఉండగా ఓ ప్రయాణికుడికి ఉన్నట్టుండి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఈ విషయాన్ని గమనించి ఎయిర్‌హోస్టెస్ పైలెట్‌కు సమాచారం ఇచ్చింది. పైలెట్ వెంటనే మీనంబాక్కం విమానాశ్రయం కంట్రోల్ రూం అధికారులకు ఆ విషయాన్ని తెలిపారు. విమానాశ్రయ అధికారులు ఆ విమానం ల్యాండింగ్ చేసేందుకు అనుమతిచ్చి ఆ ప్రయాణికుడికి చికిత్స చేసేందుకు వైద్యులను కూడా సిద్ధం చేశారు. ఆ విమానం ఉదయం 6.30 గంటలకు ల్యాండింగ్ అయ్యింది. అక్కడ సిద్ధం చేసిన అంబులెన్స్‌లో అస్వస్థత చెందిన ప్రయాణికుడిని చికిత్స నిమిత్తం నగరంలోని ప్రముఖ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆ విమానం ఉదయం 7.20 గంటలకు లక్నో బయలుదేరింది.

సెక్స్ కోసం భర్తను ఓ మహిళ వేధిస్తుందంటూ కలెక్టర్‌కు భార్య ఫిర్యాదు

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాకు ఉద్యోగం కోసం వెళ్లిన భర్తను తరచూ సెక్స్‌లో పాల్గొనమని ఓ మహిళ వేధిస్తోందని, తన భర్తను రక్షించాలంటూ భార్య కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. నాగపట్టణం జిల్లా పెరియతుంబూర్ ప్రాంతానికి చెందిన ఉదయజ్యోతి నాగపట్టణం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేసిన వినతిపత్రంలో... తన భర్త గవాస్కర్ జనవరి 14వ తేది ఉద్యోగం కోసం సౌదీ అరేబియాకు వెళ్లాడని, అక్కడ ఫాంహౌస్‌లో ఒంటెలు, మేకలను సంరక్షించే ఉద్యోగం కల్పించారని తెలిపింది. ఆ ప్రాంతంలో ఉంటున్న 50 ఏళ్ల అరేబియన్ మహిళ, తరచూ సెక్స్‌లో పాల్గొనాలని భర్త గవాస్కర్‌ను ఒత్తిడి చేస్తున్నారని, ఈ విషయాలను గవాస్కర్ తనకు ఫోన్‌చేసి రోధిస్తున్నారని తెలిపింది. సౌదీ అరేబియాలో ఉన్న తన భర్తను రక్షించాలని ఉదయజ్యోతి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది.

● దుకాణాలపై తమిళపేర్ల వ్యవహారం..

చెన్నై కార్పొరేషన్‌కు హైకోర్టు నోటీసు

చెన్నై, మే 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్ని దుకాణాల నేమ్‌బోర్డుల్లో తప్పనిసరిగా తమిళ పేర్లుండాలని ఈ నెలాఖరులోగా ఈ ఆదేశాలను పాటించని దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామనే జీసీసీ ఉత్తర్వుపై హైకోర్టు నోటీసు జారీ చేసింది. నాలుగు వారాల వ్యవధిలో కార్పొరేషన్ ఇచ్చిన ఉత్తర్వుపై పునఃసమీక్ష చేయాలని ఆ నోటీసులో పేర్కొంది. నగరంలోని దుకాణాల నేమ్‌బోర్డుల్లో తమిళభాషకే ప్రాధాన్యం ఇవ్వాలని, దాని దిగువ ఆంగ్లం లేదా ఇతర భాషలలో పేర్లుండాలని, ఈ నిబంధనను పాటించకపోతే రూ.2వేల జరిమాన కూడా విధిస్తామని కార్పొరేషన్ హెచ్చరించింది. ఈ ఉత్తర్వులను నిలిపివేయాలని కోరుతూ చిల్లర వ్యాపారుల సంఘం నిర్వాహకులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి లక్ష్మీ నారాయణన్ నగరంలో పలు సంస్థలు లక్షలాది రూపాయలు వెచ్చింది నేమ్‌బోర్డులు ఏర్పాటు చేసుకున్నాయని, ప్రస్తుతం తమిళభాషలో నేమ్‌బోర్డును మార్చటం వల్ల తీవ్ర నష్టం కలుగుతుందన్న పిటిషనర్ల వాదనపై కార్పొరేషన్ అధికారులు స్పందించి తమ నిర్ణయాన్ని 4 వారాల్లోగా పునః సమీక్షించాలని నోటీసు జారీ చేశారు.

● ఆటిజం యువకుడి హత్య....

వైద్యురాలికి లుకౌట్ నోటీసులు

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): పొల్లాచ్చి హోంలో ఆటిజంతో బాధపడుతున్న యువకుడిని హత్య చేసి పూడ్చిపెట్టిన వ్యవహారంలో వైద్యురాలు సహా ఐదుగురు అజ్ఞాతంలోకి వెళ్లారు. వారి ఆచూకీ కోసం 8 ప్రత్యేక పోలీసులు బృందాలు నియమించగా, వారు విదేశాలకు వెళ్లకుండా లుక్ ఔట్ నోటీసులు జారీ అయ్యాయి. కోవై సోమనూరుకు చెందిన రవికుమార్ కుమారుడు వరుణ్‌కాంత్ (22) ఆటిజం వ్యాధికి గురై మతిస్థిమితం కోల్పోడాడు. అతడిని పొల్లాచ్చి మహాలింగపురం ముల్లై నగర్‌లోని ఓ ప్రైవేటు హోంలో చేర్పించారు. ఈ హోంను పొల్లాచ్చికి చెందిన సాజా గిరిరాజ్, డా.కవిత నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 12న వరుణ్‌కాంత్‌ను కర్రలతో కొట్టి హతమార్చి, నడుప్పుని సమీపం పి.నాగూర్‌లోని హోం నిర్వాహకులు డా.కవితకు చెందిన తోటలో గుంత తవ్వి పాలిథిన్ కవర్లో వరుణ్‌కాంత్ మృతదేహాన్ని ఉంచి పూడ్చిపెట్టారు. పూడ్చి పెట్టిన ప్రాంతంలో మొక్క నాటారు. దీనిపై అందిన ఫిర్యాదుతో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని వరుణ్‌కాంత్ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. ఈ వ్యవహారంలో డా.కవిత హోం వార్డన్ రితీష్, నిర్వాహకులు గిరిరాజ్, ఉద్యోగులు రంగనాయకి, సెంథిల్‌బాలుతదితరులపై పోలీసులు కేసు నమోదుచేశారు. నిందితులు అజ్ఞాతంలోకి వెళ్లడంతో, వారి ఆచూకీ కోసం 8 ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసిన పోలీసు శాఖ, వారు విదేశాలకు తప్పించుకుపోకుండా లుక్ ఔట్ నోటీసు జారీ చేసింది.

ఏఎస్పీగా సురేష్ బాధ్యతల స్వీకరణ



వేలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): వేలూరు గుడియాత్తం ఏఎస్పీగా వీఎస్‌జీ సురేష్ మంగళవారం ఉదయం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నేతలు, సామాజిక కార్యకర్తలు, వివిధ సంఘాల నేతలు ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్టేషన్‌కు స్వాగతం పలికారు.



'సర్దార్-2' తర్వాతే కొత్త చిత్రం

● మాళవికా మోహనన్

హీరో కార్తీ సరసన తాను నటిస్తున్న 'సర్దార్-2' చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుందని, ఈ మూవీ చిత్రీకరణ పూర్తయిన తర్వాతే తన కొత్త చిత్రంపై ప్రకటన చేస్తానని హీరోయిన్ మాళవికా మోహనన్ వెల్లడించారు. మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ సరసన నటించి వెండితెరకు పరిచయమైన మాళవికా మోహనన్.. తమిళంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ 'పేట', విజయ్ 'మాస్టర్', చియాన్ విక్రమ్ 'తంగలాన్', ధనుష్ వంటి అగ్రహీరో చిత్రాల్లో నటించి దక్షిణాది భాషల్లో తనకంటూ ఓ గుర్తింపు సొంతం చేసుకున్నారు. టాలీవుడ్ హీరో ప్రభాస్‌తో 'ది రాజా సాబ్' అనే చిత్రంలో నటించారు.. అయితే, ఈమెకు వరుసగా సినీ అవకాశాలు మాత్రం లభించడం లేదు. ఒక చిత్రంలో నటించిన తర్వాత కొంత గ్యాప్ వస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతం కార్తీ హీరోగా నటించే 'సర్దార్-2'లో ముగ్గురు హీరోయిన్లలో ఒకరిగా నటిస్తున్నారు. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ, 'ఈ సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. అనేకంగా జూన్ నెలాఖరునాటికి చిత్రీకరణ పూర్తవుతుందని భావిస్తున్నాను. ఆ తర్వాత తన కొత్త చిత్రంపై అధికారిక ప్రకటన చేస్తాను' అని వెల్లడించారు.

సోషల్ డ్రామా నేపథ్యంలో 'పరమశివన్ ఫాతిమా'

విమల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'పరమశివన్ ఫాతిమా'. సోషల్ డ్రామా నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి ఇసక్కి కార్వన్నన్ దర్శకుడు. ఈయన గతంలో 'తమిళ్ కుడిమగన్', 'పెట్టికడై', 'పగిరి' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. విమల్ సరసన చాయాదేవి నటించగా, ఇతర పాత్రల్లో ఎంఎస్ భాస్కర్, మనోజ్ కుమార్, శ్రీ రంజిని, అధీరా, అరున్‌దాస్, కూల్ సురేష్, కాదల్ సుకుమార్ తదితరులు నటించారు. మైనా సుకుమార్ సంగీతం సమకూర్చగా, దీపన్ చక్రవర్తి సంగీతం. ఈ చిత్రం జూన్ 6వ తేదీన విడుదల చేయనున్న నేపథ్యంలో సోమవారం రాత్రి ఈ సినిమా ట్రైలర్, ఆడియో రిలీజ్ చేశారు. ఈ సినిమా గురించి దర్శకుడు ఇసక్కి కార్వన్నన్ మాట్లాడుతూ, 'ఇది ఒక సోషల్ ఫ్యామిలీ డ్రామా. సినిమా టైటిల్ వివాదాస్పదంగా కనిపించినప్పటికీ ఇందులోని కథాంశం మాత్రం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. కమల్ హాసన్ నటించిన 'థగ్‌లైఫ్' జూన్ 5వ తేదీ విడుదలవుతుండగా, మా చిత్రాన్ని మరుసటి రోజున విడుదల చేస్తున్నాం. దీనికి కారణం కథపై మాకు బలమైన నమ్మకం ఉంది' అని అన్నారు.



'పరమశివన్ ఫాతిమా' ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రజ్యోతి

మతానికి అతీతమైన వ్యక్తిని

● విజయ్ ఆంటోని

తాను మతానికి అతీతమైన వ్యక్తినని, ప్రపంచంలో కులమతాలుండకూడదని భావించే వ్యక్తినని హీరో విజయ్ ఆంటోనీ పేర్కొన్నారు. విజయ్ ఆంటోనీ, అజయ్ దిషాన్, సముద్రఖని, బ్రిగిడ, దీప్షిక, మహానది శంకర్, వినోద్ సాగర్ తదితరులు నటించిన చిత్రం 'మార్గాన్' జూన్ 27వ తేదీ విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ సోమవారం నగరంలో నిర్వహించారు. ఇందులో విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ 'నేను కులమతాలకు అతీతమైన వ్యక్తిని. సమాజంలో కులమతాలుండరాదని భావించే వ్యక్తిని. నేను వరుసగా చిత్రాలు నిర్మిస్తున్నారు. అలాగని నా వద్ద భారీగా డబ్బులున్నాయని కాదు.. అప్పులు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. ఆ రుణాలకు నెల నెలా వడ్డీ కూడా కడుతున్నాను. ఈ సినిమా దర్శకుడు లియో నాకు 'పిచ్చైక్కారన్' మూవీ ఎడిటింగ్ చేసే సమయం నుంచి తెలుసు. నేను నటన వైపు మొగ్గు చూపిన తర్వాత సంగీతం సమకూర్చడం మానేశాను. లియో మాత్రం అలా చేయరాదు. దర్శకత్వం వహించిన మీ చిత్రాలకు మీరే ఎడిటింగ్ చేయండి. మన జీవితంలో మరిచిపోలేని మధుర స్మృతులు కొన్ని ఉంటాయి. ఆ ప్రకారంగా 'డిష్యూం' చిత్రం ద్వారా దర్శకుడు శశి నన్ను సంగీత దర్శకుడిగా పరిచయం చేశారు. 15 యేళ్ళ తర్వాత మళ్ళీ 'పిచ్చైక్కారన్' సినిమాలో కథానాయకుడిగా అవకాశం ఇచ్చారు. ఇపుడు మళ్ళీ ఆయన దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నాను. ప్రతి ఒక్కరిలో ప్రతిభాపాటవాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రతి ఒక్కరి నమ్మకాన్ని నేను గౌరవిస్తాను. ఇపుడు నేను నటించే ప్రతి చిత్రానికి సంగీతం నేను సమకూర్చుకుంటున్నాను. ఈ యేడాది నా ఆర్థికస్థితిని చూసుకుని ఇతర హీరోలతో కూడా చిత్రాలను నిర్మిస్తాను' అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రంలో తన అక్క కుమారుడు అజయ్ దిషాన్‌ను వెండితెరకు ప్రతినాయకుడుగా పరిచయం చేస్తున్నారు.



'మార్గాన్' ఆడియో రిలీజ్ వేడుకలో విజయ్ ఆంటోనీ

యూట్యూబ్ చానెల్ ప్రారంభించిన అజిత్ బృందం



రేసింగ్ దుస్తుల్లో అజిత్ కుమార్

అగ్ర నటుడు అజిత్ కుమార్ బృందం 'అజిత్ కుమార్ రేసింగ్' పేరుతో యూట్యూబ్ చానెల్ ప్రారంభించారు. ఈ యేడాది ఆరంభంలో దుబాయ్ రేసింగ్ సర్క్యూట్‌లో జరిగిన కార్ రేసింగ్ పోటీల్లో అజిత్ కుమార్ జట్టు మూడో స్థానంలో నిలిచిన విషయం తెల్సిందే. ఆ తర్వాత ఇటలీలో జరిగిన పోటీల్లో ఆయన జట్టు పాల్గొని మళ్ళీ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుతం ఐరోపాలో జరిగే జీటీ-4 కార్ పోటీల్లో పాల్గొంటుంది. ఈ నేపథ్యంలో 'అజిత్ కుమార్ రేసింగ్' పేరుతో యూట్యూబ్ చానెల్‌ను ప్రారంభించింది. ఇందులో కార్ రేసింగ్ పోటీలకు తాను సమాయాత్తమయ్యే శిక్షణ వీడియోలను తన అభిమానులతో పాటు రేసింగ్ ఔత్సాహికులకు షేర్ చేయనున్నారు. తమ అభిమాన హీరో రేసింగ్ చానెల్ ప్రారంభించారని తెలియగానే ఆ యూట్యూబ్ చానెల్‌ను సబ్‌స్క్రైబ్ చేసేందుకు అభిమానులు పోటీపడుతున్నారు.

వడపళని మెట్రోరైల్వేస్టేషన్ వద్ద రూ.12 కోట్లతో స్కైవాక్



కొత్తగా ఏర్పాటుకానున్న స్కై వాక్ నమూనా చిత్రం

చెన్నై, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలో కొత్తగా ఏర్పాటు కానున్న మెట్రోరైల్వేస్టేషన్, పాత మెట్రోరైల్వేస్టేషన్ కలిసే చోట రూ.12 కోట్లతో కొత్త స్కైవాక్ నిర్మించనున్నారు. ఈ మేరకు మెట్రోరైల్వే సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ స్కైవాక్ రహదారి 130 మీటర్ల పొడవు, 6 నుండి 10 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నారు. ఈ యేడాది చివరినాటికి ఈ స్కైవాక్ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

'గుండెపోటు'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చెన్నై, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గుండెపోటుపై వినూత్న రీతిలో అవగాహనా ప్రచారం నిర్వహిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న స్ట్రోక్‌లపై అవగాహన కల్పించేందుకు రకరకాల ప్రచారాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఫ్లాష్ మాబ్‌లు, మైమ్ ప్రదర్శన, స్కిట్‌లు, బహుమతులతో ఇంటరాక్టివ్ గేమ్ వంటి ఆకర్షణీయమైన కార్యకలాపాలు కూడా ప్రదర్శిస్తున్నారు. దీని గురించి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ కృష్ణ మాట్లాడుతూ.. గతంలో తాము 'సేవ్ యంగ్ హార్ట్స్' పేరుతో చేపట్టిన ప్రచారాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు బ్రెయిన్ స్ట్రోక్‌పై ప్రచారం చేపడుతున్నామని వివరించారు. చెన్నైలో ఇటీవలి కాలంలో గుండెపోటు కేసులు గణనీయంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రజలను అప్రమత్తం చేసేందుకు, గుండెపోటుపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రచారం చేపడుతున్నట్లు వివరించారు.

పోలీస్ గ్రీవెన్స్‌లో 42 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం పోలీసు గ్రీవెన్స్ జరిగింది. మంగళవారం నిర్వహించిన శిబిరంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, పోలీసులు పాల్గొని, బదిలీ,క్వార్టర్స్ కేటాయింపు, వేతనం తగ్గింపు సహా పలు సమస్యలపై 42 వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రాలు పరిశీలించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ ఆదేశించినట్లు నగరపోలీసుశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆసియా అథ్లెటిక్స్ విజేతకు ఉదయనిధి అభినందన



అథ్లెట్ సెర్విన్ సెబాస్టియన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, మే 27 (ఆంధ్రజ్యోతి): సౌత్‌కొరియాలోని కుమీలో మంగళవారం ప్రారంభమైన 26వ ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన అథ్లెట్ సెర్విన్ సెబాస్టియన్ రజత పతకం గెల్చుకున్నాడు. ఈ పోటీల్లో రాష్ట్రానికి చెందిన ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) సెర్విన్ (20 కి.మీ, మారథాన్), తమిళరసు, రాహుల్‌కుమార్, విశాల్, సంతోష్‌కుమార్, విద్యా, అభినయా, శుభా తదితరులు పాల్గొంటున్నారు. మంగళవారం ఉదయం పురుషుల విభాగంలో 20 కి.మీ. మారథాన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్రానికి చెందిన సెర్విన్ సెబాస్టియన్ రజత పతకం గెలుచుకున్నాడు. ఈ విషయం తెలియగానే క్రీడాశాఖ కూడా నిర్వర్తిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అతడికి శుభాకాంక్షలు తెలియజేశారు.

సీఎం స్టాలిన్‌కు నటించడం ఇష్టం ఉండదు

● స్పీకర్ అప్పావు



ప్యారీస్, మే 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్‌కు నటించడమంటే ఇష్టంలేదని, ప్రజల అవసరాలను తీర్చడమే ఆయన అభిమతమని స్పీకర్ అప్పావు పేర్కొన్నారు. తిరునల్వేలిలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అనే అంశంపై సోమవారం జరిగిన సదస్సుకు సంబంధించి రాజకీయ నాయకులు తమ అభిప్రాయాలను తెలియజేశారని, ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఏమాత్రం నటన ప్రదర్శించలేదన్నారు. "దేవాదాయశాఖ అధ్వర్యంలో కళాశాలలు నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి చేసిన ప్రకటనకు వ్యతిరేకంగా కొంతమంది న్యాయస్థానానికి వెళ్ళి స్టే తీసుకున్నారని తెలిపారు. అందరూ సమానులేనన్న సంకల్పంతో డీఎంకే ప్రభుత్వం పరిపాలిస్తోందని, ఏమైన కొరతలున్నట్లు చూపిస్తే వెంటనే పరిష్కరింపజేస్తోందన్నారు. అసెంబ్లీ కార్యక్రమాలను టీవీలో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు కొన్ని విధివిధాలున్నాయని స్పీకర్‌గా తాను వాటినే పాటిస్తున్నానని, అయినప్పటికీ ప్రతిపక్షం కోరిక మేరకు ఈ వ్యవహారంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. శాసన సభ్యులు అసెంబ్లీలో ఎలాంటి అంశాల గురించి మాట్లాడాలన్నపై శిక్షణ ఇప్పిస్తున్నామని, దశలవారీగా ప్రత్యక్షప్రసారం చేసే పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీని ప్రారంభించి 104ఏళ్ళు పూర్తవుతున్నాయని, 1952వ సంవత్సరం తర్వాత అసెంబ్లీలో వివిధ పార్టీల నాయకులు మాట్లాడిన ప్రసంగ పాఠాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. 1921 నుండి 1952 వరకు అసెంబ్లీ తీసుకున్న చర్యలు, రాతప్రతులకు సంబంధించిన పరిశోధన ముమ్మరంగా జరుగుతున్నాయని, తర్వాత జరగబోయే అసెంబ్లీ సమావేశాలకు ముందు ఈ పనులన్నింటిని పూర్తిచేయనున్నట్లు స్పీకర్ అప్పావు తెలిపారు.

నుంగంబాక్కంలో 'మైనస్' క్లినిక్ ప్రారంభం



క్లినిక్ ప్రారంభోత్సవంలో ప్రముఖులు

చెన్నై, మే27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కం ఉత్తమర్ గాంధీసాలైలో 'మైనస్' పేరుతో శరీరాకృతి, చికిత్సా కేంద్రం ఏర్పాటైంది. దీనిని ప్రముఖ సినీ నటులు అరుణ్ విజయ్, ఐశ్వర్యా రాజేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైనస్ సీఈవో శరణ్ వేల్, నిర్వాహక డైరెక్టర్ చరణ్‌వేల్, కరేబియన్ బ్రేడ్ కౌన్సిల్ బోర్డు సభ్యులు రాజేష్ చందన్, ప్రముఖ శస్త్ర చికిత్సా నిపుణులు డాక్టర్ రాజ్ పళనియప్పన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఇక్కడ నాన్‌ఇన్వేసిప్, క్రయోమాక్స్ స్కల్ప్టింగ్, కోల్డ్‌ప్లే క్రయోస్పియర్ 360, ఏఐ రోబోటిక్ సోనిక్ స్లిమ్ తదితర చికిత్సలు అందజేస్తామన్నారు. పరివర్తన అంటే కేవలం రూపం గురించికాదని,అది విశ్వాసం, సౌకర్యం, వ్యక్తిగత పరిణామంగురించి అని తాము విశ్వసిస్తామన్నారు.తమక్లినిక్ అంతర్జాతీయ ప్రమాణాల సంరక్షణ అందిస్తుందని వివరించారు.

సీఐఈఎల్ హెచ్‌ఆర్ ఆదాయంలో వృద్ధి



మీడియా సమావేశంలో పాండ్యరాజన్, ఆదిత్య నారాయణ్ మిశ్రా తదితరులు

చెన్నై, మే 27 ఆంధ్రజ్యోతి): సీఐఈఎల్ హెచ్‌ఆర్ సర్వీసెస్ ఆదాయం 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.1504 కోట్లకు పెరిగిందని, ఇది 38.57 శాతం వృద్ధి అని ఆ సంస్థ ఛైర్‌పర్సన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పాండ్యరాజన్ ప్రకటించారు. మంగళవారం ఆయన చెన్నైలో తమ సంస్థ ఎండీ ఆదిత్య నారాయణ్ మిశ్రా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దొరైస్వామి రాజీవ్ కృష్ణన్ తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగి జీవితచక్రాన్ని కవర్ చేస్తూ, సాంకేతికతతో నడిచే హెచ్‌ఆర్ పరిష్కారాల పూర్తి సూట్ అందించే ఏకైక కంపెనీ అయిన సీఐఈఎల్ హెచ్‌ఆర్ సర్వీసెస్ అటానమస్ ఏఐ ఏజెంట్లు, మెషిన్ లెర్నింగ్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, కంప్యూటర్ విజన్, జనరేటివ్ ఏఐ, బ్లాక్ చెయిన్ సహా అత్యాధునిక డీప్ టెక్ ఉపయోగించుకునే ఏఐ ఏజెంట్ ప్లాట్‌ఫారమ్‌లను నిర్మిస్తున్నామన్నారు. తమ నిరంతర పరిశోధన, అభివృద్ధి పెట్టుబడులు పరిశ్రమ మార్పులకు ముందుండడాన్ని, నిరంతరం చురుకైన, స్వీయ అభ్యాస హెచ్‌ఆర్ పరిష్కారాలను నిర్మించడాన్ని నిర్ధారిస్తాయన్నారు. సీఐఈఎల్ ఫలితాలు తమ సమష్టి స్ఫూర్తిని సూచిస్తాయన్నారు. తమ వాటాదారులకు ఉత్తమమైన వాటిని అందించాలన్న సంకల్పంతో పని భవిష్యత్తును రూపొందిస్తున్నామని వివరించారు.

పండిట్ నెహ్రూకు ఘన నివాళి



జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ప్యారీస్, మే 27 (ఆంధ్రజ్యోతి): భారత తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 61వ వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు మంగళవారం ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ)ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో జరిగిన నెహ్రూ వర్ధంతి సభలో టీన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేవీ తంగబాలు, ఎస్.తిరునావుక్కరసు నెహ్రూ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. పార్టీ కోశాధికారి రూబీ మనోహరన్, ఎంపీ రాబర్ట్‌బ్రూస్, తాళ్లూరి సురేష్, అరుంబాక్కం వీరపాండ్యన్, జీకే దాస్, కౌన్సిలర్‌లు ద్రవ్యం, ఢిల్లీబాబు, మహిళా విభాగం, యువజన విభాగం కార్యకర్తలు కూడా దివంగత మాజీప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు నివాళులర్పించారు.

ఐశ్వర్య ఆస్పత్రిలో 'ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవం'



మాక్‌డ్రిల్ చేస్తున్న వైద్యబృందం

చెన్నై, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓఎంఆర్ లోని ఐశ్వర్య ఆస్పత్రిలో మంగళవారం 'ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవం' జరిగింది. ఈ సందర్భంగా విపత్తు, అత్యవసర చికిత్సా నిర్వహణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరిగిన ఈ మాక్‌డ్రిల్ స్టిమ్యులేషన్ కోసం దాదాపు పదిమంది బాధితులను అంబులెన్స్‌ల్లో ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అత్యవసర విభాగాధిపతి డాక్టర్ జనార్ధనన్ మాట్లాడుతూ.. తమ ఆస్పత్రి అత్యవసర విభాగం 24 గంటలూ అత్యాధునిక సదుపాయాలు, అత్యున్నత స్థాయి సామర్థ్యం, నైపుణ్యంతో పని చేస్తుందని, ప్రాణాలను రక్షించేందుకు తమ వైద్య బృందం సిద్ధంగా వుంటుందని వివరించారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ అరుణ్ ముత్తువేల్ మాట్లాడుతూ.. సంక్షోభ సమయాల్లో సమాజ సేవ చేయడానికి తమ ఆస్పత్రి సిద్ధంగా వుందని వివరించారు.

రూ.2కోట్లతో చేనేత విక్రయ కేంద్రం



విక్రయకేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు దురైమురుగన్, గాంధీ తదితరులు

వేలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తంలోని పిచ్చానూరులో మంగళవారం ఉదయం చేనేత వస్త్ర విక్రయకేంద్రం ప్రారంభమైంది. రాష్ట్ర చేనేతశాఖ మంత్రి ఆర్.గాంధీ, జలవనరులశాఖ మంత్రి దురైమురుగన్ ఈ విక్రయకేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి గాంధీ మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం రూ.2కోట్లతో ఈ చేనేత విక్రయకేంద్రం ఏర్పాటుచేసినట్టు తెలిపారు. అదే విధంగా సేదుక్కరై గ్రామంలో కూడా సుమారు రూ.8.41 కోట్ల తో విక్రయకేంద్రాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎమ్మెల్యేలు నందకుమార్, అమ్ములు, గుడియాత్తం డీఎంకే అధ్యక్షుడు సౌందరరాజన్ తదితరులు పాల్గొన్నారు.

అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 'ఫ్లీట్ ఆఫ్ హోప్' అంబులెన్స్ సేవలు



అంబులెన్స్ సేవలను ప్రారంభిస్తున్న ట్రిప్లికేన్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ చొక్కయ్య తదితరులు

చెన్నై, మే 27 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవం సందర్భంగా మంగళవారం 'ఫ్లీట్ ఆఫ్ హోప్' పేరిట 1066 నెంబర్‌లో అందుబాటులో ఉండేలా అత్యవసర అంబులెన్స్ సేవలను ప్రారంభించింది. కీల్పాక్‌లోని సెయింట్ జార్జెస్ ఆంగ్లో ఇండియన్ హయ్యర్ సెకండరీ స్కూలులో ఏర్పాటైన కార్యక్రమంలో ట్రిప్లికేన్ ట్రాఫిక్ విభాగం అసిస్టెంట్ పోలీసు కమిషనర్ చొక్కయ్య ఈ అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. అపోలో హాస్పిటల్స్ మెడికల్ సర్వీసెస్ చీఫ్ డాక్టర్ రోహిణి శ్రీధర్, చెన్నై రీజియన్ సీఈఓ డాక్టర్ ఇలన్‌కుమరన్ కళియమూర్తి, రీజినల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ దవపళని పాల్గొన్నారు.



కొళత్తూరు అనితా అచీవర్స్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకుని మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్ చేతుల మీదుగా సహాయాలు అందుకున్న లబ్ధిదారులు



నామక్కల్ జిల్లా తిరుచెంగోడు అర్ధనారీశ్వరాలయంలో వయ్యాసి విశాఖ వేడుకలు జూన్ ఒకటిన ప్రారంభం కానుండటంతో మంగళవారం ఉదయం నిర్వహించిన భద్ర కాళియమ్మన్ రథోత్సవం

తిరుమలలో బాటగంగమ్మ జాతర



బాటగంగమ్మ



విశేష అలంకరణలో అమ్మవారి ఆలయం

తిరుమల, మే27(ఆంధ్రజ్యోతి): తిరుమల బాటగంగమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. పాపవినాశనం నడక మార్గంలోని బాటగంగమ్మ ఆలయంలో ఏటా స్థానికులు జాతర నిర్వహిస్తారు. అమ్మవారి ఆలయాన్ని పుష్ప, ఫల, విద్యుత్ లైట్లతో శోభాయమానంగా అలంకరించారు. మంగళవారం ఉదయం 6 నుంచి 9 గంటల నడుమ అమ్మవారి నేత్ర దర్శనం జరిగింది. తర్వాత అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అలంకార దర్శనాలు మొదలయ్యాయి. జాతర సందర్భంగా తిరుమలతో పాటు తిరుపతి స్థానికులు బాటగంగమ్మను దర్శించుకున్నారు. అన్నదానం నిర్వహించారు.



భక్తులకు అన్నదానం

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.5.09 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 83,542

తలనీలాలు సమర్పించినవారు: 34,265





జస్టిస్ ఇందిరేష్ - దిల్ రాజు దంపతులు

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈఎస్ ఇందిరేష్, సినీ నిర్మాత దిల్‌రాజు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కర్ణాటక మంత్రి శివరాజ్ ఉన్నారు. ఆలయం ముందు నిర్మాత దిల్‌రాజు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ మంచి దర్శన ఏర్పాట్లు చేస్తోందని, స్వామి ప్రసాదాలు చాలా బాగుంటున్నాయన్నారు.

నలుగురు దళారులకు కౌన్సెలింగ్

శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): దర్శనాల పేరుతో భక్తులను మోసగించే నలుగురు దళారులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి తెలిపారు. ముక్కంటి ఆలయ పరిసరాల్లో భక్తులను మోసగించే దళారులపై సీఐ ప్రత్యేకంగా మంగళవారం నిఘా పెట్టారు. ఈ క్రమంలో నలుగురు యువకులు భక్తులకు మాయమాటలు చెప్పి దర్శనాలు చేయిస్తామని నమ్మిస్తుండగా సీఐ వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి పంపించారు.



పోలీసుల అదుపులో దళారీలు

భూసేకరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ, నిర్మాణ పనులను ప్రణాళికబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జేసీ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కోసం చేపడుతున్న నిర్మాణ పనులు, రైల్వే ప్రాజెక్టు పనులు, పురోగతిలో ఉన్న రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుట, పాకాల, తిరుపతి టౌన్‌కు సంబంధించి రైల్వే ప్రాజెక్టుపనులను వేగవంతం చేయాలన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ పూర్తయిందన్నారు. ఇక జాతీయ హైవేలు తిరుపతి-తిరుత్తణి, సి.మల్లవరం-రేణిగుంట, నాయుడుపేట-తిరుపతి, పీలేరు-కలూరు, రేణిగుంట-కడప లైన్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయ భరత్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మధుసూదన్‌రావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ సురేంద్రనాయుడు, నేషనల్ హైవే పీడీలు రవీంద్రరావు, వెంకటేశ్వర్లు, వెంకటాచలపతి, ఆర్డీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మీరు ప్రతిభ సాధించి.. విద్యార్థులకు నేర్పించాలి

- ఉమ్మడి జిల్లా డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లకు డీఈవో సూచన
- డీఆర్పీలకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో కుమార్

తిరుపతి(విద్య), మే 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడంలో ప్రతిభ సాధించి.. వారికి నేర్పించాలని డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లకు (డీఆర్పీ) డీఈవో కేవీఎన్ కుమార్ సూచించారు. డీఆర్పీలకు ఆరు రోజులపాటు జరిగే ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై శిక్షణ తరగతులను మంగళవారం తిరుపతిలో డీఈవో ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు భాష, గణితంపై పట్టు కలిగేలా ఆటపాటలతో ఆసక్తికరంగా బోధించాలన్నారు. అటువంటి నైపుణ్యాలను డీఆర్పీల్లో కలిగించేందుకే ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ బోధన నైపుణ్యాలను పెంపొందించుకుని మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు మాట్లాడుతూ.. రాయడం, చదవడం వంటి కనీస అభ్యసన స్థాయిలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు డీఆర్పీల నుంచి ఉపాధ్యాయుల వరకు కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో తిరుపతి జిల్లా నుంచి 102 మంది, చిత్తూరు జిల్లా నుంచి 93 మంది డీఆర్పీలకు 16 మంది కేఆర్పీలు శిక్షణ ఇస్తారని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి, స్టేట్ ప్రథం కోఆర్డినేటర్ కన్నయ్యనాయుడు, చిత్తూరు జిల్లా అసిస్టెంట్ ఏఎంవో సుభాషిణి, తిరుపతి జిల్లా సమగ్రశిక్ష అల్టర్నేటివ్ స్కూల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

డ్రోన్‌కు చిక్కారిలా..

తిరుపతి(నేరవిభాగం), మే 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పరిధిలో సోమవారం అర్ధరాత్రి అధునాతన మ్యాట్రిక్ థర్మల్ 4 డ్రోన్‌తో నైట్ బీట్ నిర్వహించారు. సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. దామినేడు పరిధిలో అటుగా వెళుతున్న వాహనాలను కొందరు హిజ్రాలు ఆపి ఇబ్బంది పెడుతున్న దృశ్యాలను డ్రోన్ కెమెరాలతో గుర్తించారు. అక్కడికి పోలీసులు చేరుకుని ప్రశ్నించారు. ఇక్కడకు ఊరికే వచ్చామని వారు సమాధానం చెప్పారు. రాత్రి సమయాల్లో ఎక్కడ పడితే అక్కడ ఉండకూడదని హెచ్చరించి పంపారు. వాహనదారులు, ప్రజలను ఇబ్బంది పెడితే కేసులు నమోదు చేస్తామని వారిని హెచ్చరించారు. అలిపిరి పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, జూదం ఆడుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు.



ముగ్గురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

- 13 కిలోల గంజాయి స్వాధీనం

శ్రీకాళహస్తి, మే 27(ఆంధ్రజ్యోతి): ముగ్గురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అరెస్టు చూపారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ... ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి రవాణాపై నిఘా పెట్టామన్నారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి సిబ్బందితో సోమవారం సాయంత్రం పట్టణ శివార్లలోని చెన్నై రహదారిపై గంజాయి రవాణా సాగుతున్నట్లు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారన్నారు. తమిళనాడుకు చెందిన మురళి, శ్యామ్‌రాజ్, సంజయ్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు యువకులు ఒడిశా నుంచి తమిళనాడుకు గంజాయి స్మగ్లింగ్ చేస్తుంటారన్నారు. ఈ క్రమంలో గంజాయిని తమిళనాడుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోని శ్రీకాళహస్తి వద్ద దాడి చేశామన్నారు. మురళి, శ్యామ్‌రాజ్, సంజయకుమార్ 13 కిలోల గంజాయితో పట్టుబడగా మరో ఇద్దరు పరారయ్యారన్నారు. ఈ కేసులో చురుగ్గా వ్యవహరించిన సీఐ నాగార్జునరెడ్డి, ఎస్ఐ పార్థసారథి, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, నందకుమార్, రేగాన్‌ను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.



స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న డీఎస్పీ

ఆర్టీసీ బస్సులను సమయపాలన ప్రకారం నడపాలి



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో శుభ్రత పాటించి బస్సులను సమయపాలన ప్రకారం నడపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వీసీ ద్వారా జిల్లాలోని ఆర్టీసీ డిపో మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. బస్‌స్టేషన్‌లో పరిసరాలను ఎప్పటికపుడు శుభ్రం చేసి మరుగుదొడ్ల నిర్వహణ బాగుండలన్నారు. బస్సులు అన్ని కండిషన్లలో ఉండేలా ఎప్పటికపుడు మరమ్మతులు చేపట్టాల్నారు. బస్‌స్టేషన్ ఆవరణలోని దుకాణాల్లో నిర్ణీత ధరలకే వస్తువులను అమ్మాలన్నారు. ఈ నిబంధనలు అతిక్రమించిన దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి వెంకట్రావు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మహానాడు సంబరం





కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.

